# నిశ్శబ్ద సంగీతం

— ఆర్. శాంత సుందరి



ఆఫీసునుంచి అలసిపోయి ఇంటికివచ్చిన అమర్, ఇల్లు చాలా నిశ్శబ్దంగా ఉండటం చూసి ఆశ్చర్యపోయాడు. రాజు బయటలేడు. రోజూ తను వచ్చే సమయానికి తలుపుదగ్గరే తిష్టవేసేవాడు. తన సైకిలెక్కి బెల్లు మోగించేవాడు. ఇవాళ ఈ నిశ్శబ్దం కొత్తగా ఉందే!

తండ్రిగదిలో దీపం వెలగటంలేదు. లోనుంచి ఉండుండి అతను సన్నగా దగ్గటం మట్టుకు వినిపిస్తూ ఉంది. తల్లి గదిలోంచి పైస్థాయిలో భజన వినిపిస్తోంది. అంటే ఆమెకీరోజు పోట్లాటకు ఎవరూ దొరకలేదన్న మాట! వదినెగది దగ్గరకెళ్ళి, 'రాజూ,' అని నెమ్మదిగా పిలిచాడు. సమాధానం రాకపోవటంతో తనగదిలోకి నడిచాడు అమర్.

ఎదురుగా దమయంతి ఫొటో. ఆమె కళ్ళు ఎంత బావుంటాయో, ఎన్ని కబుర్లు చెబుతాయో! పాతజ్ఞాపకాలు ముసురుకుని ఆమెలేని గది మరింత శూన్యంగా అనిపించింది అమర్‌కు.

* * * *

నెల రోజులక్రితం కన్నీళ్ళు నిండిన కళ్ళతో దమయంతి పుట్టింటికి వెళ్ళిపోయింది. అప్పటికీ యిప్పటికీ గది అలాగే ఉంది - ఏ మార్పులేదు. వెళ్ళేముందు ఆమె ఏమీ మాట్లాడలేదు. అసలు ఆమె నోరు విప్పటమే అరుదు! ఆనందం కలిగితే నీరెండలాంటి నవ్వుతో మొహం వెలిగిపోయేది. మనసు బావుండకపోతే మబ్బులు కమ్మిన ఆకాశంలా అయేది. అమర్ ఆఫీసుకెళ్ళేటప్పుడు కిటికీలోంచి ఆమె చూపులు కనుచూపుమేరదాకా అతన్ని వెంటాడేవి, సాయంత్రం అదే కిటికీదగ్గర ఎదురుచూస్తూ ఉండేవి.

మూడేళ్ళక్రితం అమర్ జీవితంలో అడుగుపెట్టిన దమయంతి అతని ప్రాణంకన్నా మిన్నయిపోయింది. తనగురించి ఆమె ఎప్పుడూ ఆలోచించేదికాదు. అందుకే ఆమె ఇంట్లో అందరితో అంత బాగా కలిసిపోగలిగింది - మామగారికి ఇష్టమైన టిఫిన్ చెయ్యడం, తోటికోడలితో ఇంటి పనులు చూడటం, అన్నీ ఆమే చూసుకొనేది. కొన్నాళ్ళకి ఆమె చేసే పనులు అందరికీ అలవాటయిపోయి, పనులు చేసిపెట్టే వారొకరున్నారన్న సంగతే మరచిపోయారు.

ఆ యాంత్రికజీవితంనించి కాస్త తెరిపి దొరికినప్పుడు రాజు తో గడిపేది దమయంతి. రాజుకి కూడా తనపిన్ని ఒక స్నేహితురాలిగా కనిపించేది. సాధారణంగా గంభీరంగా ఉండే ఆమె రాజు ఉన్నప్పుడుమట్టుకు చిన్నపిల్లలా వాడితో ఆడి ఇల్లంతా పరుగెత్తేది. అందుకే ఎప్పుడూ నీడలాగ రాజు ఆమె వెనకే తిరిగేవాడు. రాత్రి బలవంతాన వాణ్ణి అమ్మ దగ్గరకు పంపవలసి వచ్చేది.

ఇంట్లో అందరినీ అంతగా ఆకట్టుకున్న దమయంతి అత్తగారిని మాత్రం సంతృప్తి పరచలేకపోయింది. అత్తగారు ఓ ఆఫీసరుగారి కుమార్తె, ఆగర్వంతో ఎవర్నీ లెక్కచేసేది కాదు. మామగారు కూడా ఆవిడముందు నోరెత్తేవాడు కాదు. జీవితమంతా ఆయన 'సార్! సార్!' అంటూనే గడిపాడు ఆఫీసులో. కాని ఇంట్లో పెళ్ళాం కూడా తను ఆఫీసరు కూతురినని జ్ఞాపకం చేస్తూ ఉండేది. పేరుకే ఆయన ఇంటిపెద్ద - ఇంట్లో రాజ్యం

నికి!" అని అమర్ ఉడికించాడు. రాజు ఉత్సాహం ఓ నెలరోజుల్లో చప్పబడిపోయింది కాని దమయంతి మాత్రం దాన్ని సాకుతూనే ఉంది. పండుటాకులని తీసిపారేయటం, వేళకి నీళ్ళు పోయటం చేసేది. అది పూలు తొడిగినప్పుడు ఆమె సంతోషం చెప్పనలవికాదు. ఇన్నాళ్ళు చేసిన సేవకి ఫలితం, ఇక కాయలు వస్తాయి అని ఎదురుచూసింది. కాని ఎంతకీ కాయలు కాయ లేదది!

ఈలోగా ఇంట్లో గొడవతో, దమయంతి పుట్టింటికి వెళ్ళిపోవలసి వచ్చింది.

అమర్ ఒరిగిన చెట్టుని నిలబెడదామని చూసాడు. మాను సరిచేయబోతుంటే ఆకులూ కొమ్మలూ అతని మీద పడ్డాయి. కోమలమయిన చేతులతో త నను కౌగలించుకున్నట్టయింది!'

ఒక్కక్షణం గతంలోకి వెళ్ళాడు అమర్. పెళ్ళికూతురి ముస్తాబుతో, అడుగులో అడుగువేసుకుంటూ దమయంతి అతని మెడలో దండ వేయడానికి వచ్చింది. రెండు కోమలమైన చేతులు అతని భుజాల వైపు రావడం కనిపించింది. అంతే! ఆలోచన తెగిపో యింది - విరిగిన కొమ్మలోంచి పాలచుక్క కాలిమీద పడటంతో!

పుట్టింటికెళ్తూ దమయంతి తనముందు వంగినప్పు డు సరిగ్గా ఇలాగే ఆమె కన్నీటి చుక్కలు కాళ్ళమీద పడ్డాయి. అది జ్ఞాపకం రాగానే అగ్గిరవ్వ వంటిమీద పడ్డట్టు తుళ్ళిపడ్డాడు.

మొక్క ఛిన్నాభిన్నమయిపోయి వీధివాకిలి బోసిపో యింది. బొప్పాయిచెట్టు కాయలేదు. కాని దాని పచ్చద నంతో ఎంతో నిండుదనం వచ్చింది. కళ్ళకి ఎంతో హాయిగా ఉండేది. పళ్ళు బజారులోనూ దొరుకుతాయి. కాని పచ్చదనాన్ని కొని తెచ్చుకోగలమా?

జీవితంలో ప్రతి వస్తువునీ లాభనష్టాలు బేరీజు వేసుకునే చూస్తామా? బంధుత్వం ఆత్మీయత వ్యాపార మేనా? ఏమైనా లాభం ఉంటేనే బంధుత్వమా - లేకపోతే లేదా? సితారు విలువ దాని తీగల్లోనేనా - దాన్లోంచి వినిపించే సంగీతానికేం లేదా? గులాబీలను మందుల్లో వాడేవాళ్ళు, దాని రేకుల అందాన్ని గురించి ఆలోచించగేనో!

దమయంతి ఫొటోవేపు చూస్తూ అమర్ అనుకున్నా డు - అమ్మకు ఆమెమీద ఇంతకోపం ఎందుకు? తను ఆవిడ కొడుకు మాత్రమేనా - దమయంతికి మొగుడు కాదా? భార్యపట్ల తనకు బాధ్యతలు లేవా?


పొద్దున్నించీ అమర్‌గది ఖాళీగా ఉంది. ఎవరికీ చెప్పకుండా ఎక్కడికి వెళ్ళాడా అని అందరూ ఆశ్చర్య పోయారు. ముసలాయన అమర్ ఆఫీసులో కనుక్కొని వచ్చాడు. ఇంతలో ఇంటిముందు రిక్షా ఆగింది. 'అమ్మా, పిన్నివచ్చిందే' అని అరుస్తూ రాజు బైటికి పరుగెత్తాడు.

వదినె బైటికి వచ్చి దమయంతిని కావలించుకుంది. ముసలాయన ముఖం చాటంత అయింది. ముసలా విడ పూజగదిలోకి దూరింది భజన చేయటానికి.

'చెప్పి వెళ్ళకపోయావా? అందరం గాభరాపడ్డాం! అన్నాడు ముసలాయన కొడుకుతో. ఆమాటల్లో మంద లింపు తక్కువ, మె చ్చుకోలు ఎక్కువగా ఉంది. అమర్ దమయంతిని తీసుకురావడం చూసి - తల్లితప్ప - ఇంటిల్లిపాదీ సంతోషించారు.

'కాయలు కాయని చెట్లని కొట్టేయక్కరలేదు. వాటివ ల్ల ఇంటికి నిండుదనం వస్తుంది. కాయలు లేకపోతే నేం, వాటి పచ్చదనమే చాలు!'' అని తల్లికి వినిపించే టట్టు గట్టిగా అన్నాడు అమర్, ఒరిగిన "బొప్పాయి చెట్టు వేపు చూస్తున్న దమయంతితో.

**[డా॥ ధర్మేంద్రనాధ్ హిందీ రచన 'ఆంగన్ కే పేడ్' ఆధారంగా]**




## విశాఖపట్నంలో
## మహిళా సమస్యల అధ్యయనంపై
## జరిగిన నాల్గవ జాతీయ మహాసభ విశేషాలు

"మహిళలూ, మగవారిని ద్వేషించకండి" మహిళా సమస్యల అధ్యయనం మీద జరిగిన నాల్గవ జాతీయ మహా సభలో శ్రీమతి ఈలాపాధక్ వుద్బోధ:-

"భారతదేశంలో మహిళలు మగవారినే తమ కష్టాలన్నింటికీ కారకులుగా ద్వేషిస్తుంటారు. ఎందుకంటే మనది పురుషాధిక్యత సమాజం కాబట్టి అని అనుకుంటాం. కాని ఈ ధోరణి సమర్ధనీయం కాదు" — అన్నారు మహిళా సమస్యల అధ్యయనంపై కృషి చేస్తున్న ఇండియన్ అసోసియేషన్ అధ్యక్షురాలు డాక్టరు ఈలాపాధక్. విశాఖపట్నం, ఆంధ్రవిశ్వవిద్యాలయం అసెంబ్లీ హాలులో ప్రారంభమైన నాల్గవ మహిళా సమస్యల అధ్యయనాల మహాసభకు ఆమె అధ్యక్షతవహించారు.

"పురుషులతోసమాన హక్కులు కల్పించాలని డిమాండ్ చేయటం, పురుషులే తమకు బద్ధ శత్రువులుగా భావించటం వంటి భావాలన్నీ పాశ్చాత్యదేశాల మహిళల లక్షణాలు. కానీ వాస్తవంగా మనదేశంలో కోడళ్ళను అత్తలూ, ఆడపడచులు వేధించటం మనం చూస్తున్నాం. స్త్రీకి స్త్రీయే శత్రువుగా తయారైందని వాదించే స్త్రీలను కూడా మనం చూస్తున్నాం. ఈపరిస్థితి మనం ఎదుర్కోవాలి. ఇది పురుషాధిక్య సమాజం అనుకుంటూ పురుషజాతినశించాలి-అని భావించటం కూడా తెలివి తక్కువ తనం. క్షత్రియులందర్నీ హతమార్చుతానంటూ పరశురాముడు చేసిన యత్నంలాంటిదే ఇలా భావించటం కూడా. అందుకే, భారతీయ మహిళలు పురుషుల్ని ద్వేషించ కూడదు" — అన్నారు శ్రీమతి ఈలాపాధక్.

శ్రామిక మహిళల విషయంలో, సమాన హక్కులకోసం, ప్రత్యేక హక్కులకోసం మహిళా సంఘాలు కృషి చేయాలి ఎందుకంటే శ్రామిక మహిళలకు కూడా కాన్పులు, శిశువుల పెంపకం వంటి సమస్యలు వుంటాయి కనుక అని శ్రీమతి పాథక్ సూచించారు.

ఏ వయస్సులోనైనప్పటికీ మహిళ ఆత్మహత్య చేసుకోవ టానికి కారణమవుతున్న కుటుంబ పరిస్థితులను గురించి మహిళా సంఘాలు నిశితంగా అధ్యయనంచేయాలని, అలాంటి పరిస్థితుల్లో స్త్రీలకు వుండాల్సిన ఆత్మ స్థైర్యం, చైతన్యంగురించి, వాళ్ళలో మనోవికాసం కల్పించే కార్యక్రమాల్ని చేపట్టాలనీ ఆమె కోరారు. ఈ లక్ష్యసాధనంకోసం మహిళా సమస్యల పరిశోధకులు, మహిళా స్వచ్ఛంద సంఘాలు, సంయుక్తంగా కలిసిపనిచేయాలని ఆమె ఉద్బోధించారు.

ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్రవిశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ శ్రీ కె.వి. రమణ, మాట్లాడుతూ "మహిళలను సంస్కరించే ఏకార్యక్రమమైనా గ్రామాల్లో ప్రారంభంకావాలని, ఆంధ్రవిశ్వవిద్యాలయం నిర్వహించే మెట్రిక్ పరీక్ష దేశంలో చాలాప్రాచుర్యం పొందినదని, ప్రతియేటా కొన్ని వేలమంది గృహిణులు, ఆంధ్రమెట్రిక్ పరీక్షలు వ్రాసి, ఉన్నత విద్య అభ్యసిస్తున్నారనీ, ఇది ఆంధ్ర విశ్వవిద్యాలయం స్త్రీ విద్యపట్ల చేస్తున్న కృషికి ఎంతో గర్వకారణంగా నిలుస్తుందనీ అన్నారు.

ఇండియన్ అసోసియేషన్ ఫర్ విమెన్ స్టడీస్, ప్రధానకార్యదర్శి ప్రొఫెసర్ సుశీలా కౌశిక్, నివేదికసమర్పిస్తూ, మొత్తం 450 మంది ప్రతినిధులు వివిధ ప్రాంతాలనుండి ఈ మహా సభకు విచ్చేశారనీ, బంగ్లాదేశ్, నేపాల్, కెనడా, అమెరికా, ఫ్రాన్స్, జర్మనీ, మాల్దీవులు, శ్రీలంక నుండి కూడా ప్రతినిధులు హాజరయ్యారని, నాలుగు రోజులుపాటు, విశాఖపట్నం ఆంధ్ర విశ్వ విద్యాలయం ప్రాంగణంలో జరిగే ఈ నాల్గవ మహాసభలో "గ్రామీణ స్త్రీలు — బీదరికం, జీవన చైతన్యం పట్ల పోరాటం" — అనే సిద్ధాంతాన్ని ఆలంబనగా తీసుకుని, ఇంకా నేటి సమాజంలో స్త్రీలు ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యల పట్ల పరిశోధన పత్రాలను మహాసభకు సమర్పిస్తున్నారని అన్నారు.

149 పరిశోధనా వ్యాసాలు, వివిధ రంగాల్లో నిష్ణాతులైన మహిళలు, ఈ మహాసభలో చర్చించారు.

వనిత పాఠకులు యింకా ఈ సంస్థకు సంబంధించిన యితర వివరాలు తెలుసుకోవాలనుకుంటే ఈ క్రింది చిరునామాకు రాసి తెలుసుకోవచ్చును.

**ప్రొఫెసరు సుశీలాకౌశిక్**
**జనరల్ సెక్రటరీ**
**ఇండియన్ అసోసియేషన్ ఫర్ విమెన్ స్టడీస్,**
**ఢిల్లీ యూనివర్సిటీ**
**ఢిల్లీ — 110 007**

**— విశాఖవిలేకరి**